క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

జవహర్‌నగర్: బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం సబ్సిడీపై రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించనుందని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామలింగం తెలిపారు. జవహర్‌నగర్ పరిధిలో అర్హులైన కుల వృత్తిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ట



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, సాయిగీతా ఆశ్రమ గురువు సాయి కుమార్ పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు కందాడి నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు హంసరాణి, హేమంత్‌రెడ్డి, మల్లిఖార్జున్ ముదిరాజ్, పెంటయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపిక

మేడ్చల్: పట్టణంలోని 1 వ వార్డులో రూ.15లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి బుధవారం ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ మానస శ్రావణ్‌కుమార్ గుప్తాతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రవన్‌కుమార్, నర్సింహ్మారెడ్డి, ప్రభాకర్ ,ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సంపత్ కుమార్‌కు రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య పురస్కారం



పోచారం: మున్సిపాలిటీలోని నారపల్లికి చెందిన ఎస్.సంపత్ కుమార్‌కు ప్రతిష్టాత్మక రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య పురస్కారం లభించింది. ఆయన రచించిన 'క్యాస్ట్ టు క్యాస్ట్ సేల్' అనే పుస్తకానికి గాను పురస్కారాన్ని అందజేస్తున్నట్లు న్యూఢిల్లీకి చెందిన డీఆర్‌డీసీ కౌన్సిల్ ప్రకటించింది. సాహిత్య రంగంలో విశిష్ట సేవలు అందించిన రచయితలకు ఏటా ఈ కౌన్సిల్ అవార్డులను అందజేస్తుంది. అందులో భాగంగా ఈ యేడాది సంపత్ కుమార్ ఎంపికయ్యారు.

వ్యక్తి అదృశ్యం



నాగనాథ్ (ఫైల్)

జవహర్‌నగర్: భార్యతో గొడవ పడి ఇంట్లోనుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ జ్యోతి కాలనీకి చెందిన దొంగిల్ దేవిదాస్ నాగనాథ్ (31) టైలర్‌గా పని చేసేవాడు. ఈ నెల 6న మద్యం తాగవద్దని అతడి భార్య లావణ్య చెప్పడంతో గొడవపడిన నాగనాథ్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి పోయాడు. అతడి కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



జాషువా (ఫైల్)

పోచారం: ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలోని 70వ బ్లాక్‌లో ఉంటున్న మల్యాల జాషువా (19) అల్వాల్‌లోని ఓ బేకరీలో పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మధ్యాహ్నం అతను సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు ఎవరూ కారకులు కాదని కాగితంపై రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి



నాట్కాన్‌చెరువు వద్ద గంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని, ఇందులో భాగంగానే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చీర్యాలలోని ఎంఎల్‌ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అపర భగీరథుడైన ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందించి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకు వచ్చారన్నారు. మిషన్ కాకతీయ పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. ఒకప్పుడు తెలంగాణలో సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, నేడు ఎక్కడ చూసినా వేసవిలో కూడా చెరువుల్లో నీరు పుష్కలంగా ఉందన్నారు. భూగర్భ జలాలు సైతం పెరగడంతో తెలంగాణలో నీటి కొరత లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి పథకాలతో రైతులకు నీటి ఇబ్బందులు తప్పాయన్నారు. దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. అంతకు ముందు సాగునీటి దినోత్సవ కార్యక్రమంలో భాగంగా చీర్యాల నాట్కాన్ చెరువు వద్ద నిర్వహించిన గంగా పూజల్లో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. భవిష్యత్తులో చెరువుల అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రాంపల్లి దాయర గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ. 50 లక్షలతో చేపట్టనున్న పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీహాల్ , సీసీరోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఈఈ జితేందర్‌రెడ్డి, ఏఈ ప్రశాంత్, జిల్లా కోఆపరేటివ్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, చీర్యాల దేవాలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన 20 వ వార్డులో కంటివెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కంటి సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో కంటి వెలుగు వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు సుమిత్ర సురేష్, పీఏసీఎస్ సభ్యుడు మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచారం ఎస్సైగా నాగేశ్వరరావు

పోచారం: పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా బి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. కుషాయిగూడ ట్రాఫిక్ పీఎస్‌లో పనిచేస్తున్న నాగేశ్వరరావు బదిలీపై పోచారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదు



అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్: కాచవానిసింగారం గ్రామంలో సర్వేనంబర్ 66లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ శర్వాల్ బుధవారం జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, చెరువులు, కాల్వలు, కుంటలు అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ 5వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎం.భాగ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును కార్పొరేటర్ ఏకే.మురుగేష్‌తో కలిసి అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని నిరుపేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి దాతల సహకారం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్ గ్రామంలో ఒకటో వార్డులో కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం సహకారంతో సాయిప్రగతి కాలనీలో రూ. 25 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ, అవుట్‌లెట్ పనులు బుధవారం సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, వార్డు సభ్యులు భాస్కర్, పద్మ, మయూరి, పవన్‌నాయక్, కోఆప్షన్ సభ్యులు సురేశ్‌నాయక్, లత, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్, కళాశాల ఎస్టేట్ ఇన్‌చార్జ్ రవీందర్ రెడ్డి, మహేశ్వర్‌గౌడ్, విజయ్‌గౌడ్, మహేందర్ పాల్గొన్నారు.

నవ భారత నిర్మాణమే లక్ష్యంగా మోదీ పాలన



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డా. భారతిబెన్ షియాల్

పోచారం: నవ భారత నిర్మాణమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలన సాగుతోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డా. భారతీబెన్ షియాల్ అన్నారు. బుధవారం అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన రోడ్లు, రైల్వేలు, రైతు సంక్షేమం, మహిళలకు మరుగు దొడ్లు, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, స్వచ్ఛ సర్వేక్షన్ తదితర కార్యక్రమాలను వివరించారు. అన్ని రంగాల్లో భారత్ ముందుండాలని మోదీ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, డాక్టర్ మల్లారెడ్డి, గిరిజన మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కునాథ్ నాయక్, అమర మోహన్‌రెడ్డి, రామోజీ రాజు, కౌన్సిలర్ మహేష్, గుండ్ల ఆంజనేయులు, అచ్చిని నర్సింహ, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలతో భేటీ...

మేడ్చల్‌రూరల్: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ భారతి బెన్ షియాల్ బుధవారం బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిశారు. మేడ్చల్ మండలం, పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయనను కలిసి భారతి బెన్ శియాల్జీ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. మల్కాజిగిరి,హైదరాబాద్, చెవెళ్ల, భువనగిరి పార్లమెంట్ సెగ్మెంట్లలో ప్రస్తుత పరిస్థితులపై ఇరువురు సమీక్షించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన శృతి కుటుంబ సభ్యులకు మంత్రి మల్లారెడ్డి బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఈ నేపథ్యంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 46.500 వేలు చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనంద్, యాదగిరి పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

మల్కాజిగిరి: రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మల్కాజిగిరిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. మహిళల పట్ల బీజేపీ వైఖరికి ఈ సంఘటన నిదర్శనమన్నారు. రెజ్లర్లకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని పార్టీ ఆదేశాల మేరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సరోజ, నాగమణి, మేఘమాల, శ్రీనివాస్, లక్ష్మణ్, అరుణ్, మంజుల, లతా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..

ఉప్పల్ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో వెంకన్న, ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి వినోద, ఉర్మిళ, ఆంజనేయులు, స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం

- 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నియోజకవర్గ కేంద్రాల్లో రెండో విడత గొర్రెల పంపిణీ
- జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రకటించిన బీసీ కుల, చేతివృత్తి దారులకు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం అర్హులైన వారు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఈ దరఖాస్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేస్తారన్నారు.బీసీ కుల,చేతి వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమాన్ని ఈ నెల 9 ముఖ్యమంత్రి కేసీఆర్ లాంచనంగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కమలాకర్, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈనెల 9న సంక్షేమ సంబురాల సందర్భంగా రెండో విడత గొర్రెల పంపిణీ, ఇళ్ల పట్టాల పంపిణీ, బీసీ కుల వృత్తిదారులకు ఆర్థిక సాయం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఈనెల 14న నిర్వహించనున్న వైద్య దినోత్సవాన్ని ఘనంగా జరపాలన్నారు. వైద్య విద్యార్థులను వేడుకలకు ఆహ్వానించాలన్నారు. వైద్యశాఖలో ప్రతిభ కనబరిచిన అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవార్డులు అందజేయాలన్నారు. వైద్య శాఖ మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు.

నేడు 'ఊరూరా చెరువు పండుగ'



- బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు
- చెరువుల వద్ద గజ ఈతగాళ్లు, పోలీసులు, గ్రామ పెద్దలు ఉండేలా చర్యలు
- కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్ జిల్లాలో తలపెట్టిన 'ఊరూరా చెరువు పండుగ' విజయవంతానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగే ఊరూరా చెరువు పండగను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సంబురాల్లో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. చెరువులకు వెళ్లే రోడ్లను విస్తరించడంతో లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్తు సరఫరా అందించాలని, లేని పక్షంలో జనరేటర్ ద్వారా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువు కట్ట వద్ద జరిగే బహిరంగ సభను పూలతో అందంగా అలంకరించి, అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. బతుకమ్మ నిమజ్జనం చేసే చెరువుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని గ్రామాల్లో చెరువులు లేనందున ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శులు పక్కనే జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. చెరువు కట్ట పరిసరాలలో బారీకేడ్ల ఏర్పాటుతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామం నుంచి చెరువుల వద్దకు డప్పులు ,బోనాలు బతుకమ్మలతో మత్స్యకారుల వలలతో ఊరేగింపుగా వెళ్లాలన్నారు. చెరువువద్ద కట్ట మైసమ్మ పూజ తర్వాత నీటి పూజ చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బతుకమ్మ కోలాటాలు, గోరేటి వెంకన్న రాసిన 'చెరువోయి.. మా ఊరి చెరువు' తదితర పాటలు వినిపిస్తారన్నారు. సాగునీటి రంగం ప్రగతి, పంట ఉత్పత్తి, మత్స్య సంపద, భూగర్భ జలాల పెరుగుదల వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. చెరువు కట్ట వద్ద నిర్వహించే సహపంక్తి భోజనాల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. భౌరంపేట పెద్ద చెరువుతో పాటు బాచుపల్లి బిన్ చెరువు, చింతల చెరువులో పెద్ద ఎత్తున ఊరూరా చెరువు పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

సామూహిక అన్న ప్రాసన

శామీర్‌పేట్: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్ సునీత అన్నారు. మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం సామూహిక అన్న ప్రాసనలు, సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీ, నారణి, లావణ్య, మౌనిక పాల్గొన్నారు.



సామూహిక అన్న ప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం


అధిక వడ్డీ పేరుతో మోసం

అల్వాల్: రూ.3 వేలు చెల్లిస్తే 6 నెలల తర్వాత రూ. 40 వేలు ఇస్తానని ఇస్తామని డబ్బులు వసూలు చేసి తప్పించుకుని తిరుగుతున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులపై నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సప్తగిరి కాలనీలో ప్రకాశం జిల్లాకు చెందిన కోల ఏసు జర్నీ ఫౌండేషన్ సొసైటీ, జర్నీ ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఎన్‌జీవో సంస్థను ఏర్పాటు చేశాడు. అందులో చేరిన సభ్యులు రూ.3 వేలు చెల్లిస్తే 6 నెలల తర్వాత రూ.40 వేలు చెల్లిస్తామని ఆశజూపి దాదాపు 400 వందల మంది నుంచి డబ్బులు వసూలు చేశాడు. తిరిగి డబ్బులు చెల్లించకుండా తప్పించుకుతిరుగుతుండటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు కోలా ఏసుతో పాటు పవన్, రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి వ్యాపారుల కల నెరవేరుస్తాం

మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా , వీధి వ్యాపారుల జీవనోపాధి దెబ్బ తినకుండా పీర్జాదిగూడ నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్ వెండర్ జోన్స్ ఏర్పాటు చేశామని మేయరు జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. ఇకపై వారాంతపు సంతలను ఏర్పాటు చేయకుండా ప్రతిరోజు కేటాయించిన స్టాల్స్‌లోనే తాజా కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లు మొదలైన క్రయవిక్రయాలు కొనసాగేలా దుకాణాల ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం బుద్దానగర్ కమ్యూనిటీహాల్‌లో వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పరిధిలో సమీకృత వెజ్-నాన్‌వెజ్ మార్కెట్‌ను నిర్మించేందుకు ముఖ్యమంత్రి రూ.7.5 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో 120 దుకాణాల సముదాయంతో కూడిన మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. వీధి వ్యాపారులకు పునరావాసం కల్పించాలనే లక్ష్యంతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి వీధి విక్రయ సముదాయాల జోన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని అర్హులైన వారికి అందించాలనే ఆశయంతో నగరంలో ముందుగానే వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను జారీ చేయడంతో పాటు స్టాల్స్ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. కమిషనర్ వంశీకృష్ణ మాట్లాడుతూ స్ట్రీట్ వెండర్ జోన్స్‌లో దుకాణాలను నిజమైన వీధివ్యాపారులకు అందజేస్తామన్నారు.బినామీలు, అద్దెకులకు వీటిని ఇస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇందుకోసం పాలక మండలి సభ్యులు, వీధి వ్యాపారులతో కమిటీని ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు అర్హులకు స్టాల్స్ కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ , కార్పొరేటర్లు మద్ది యుగెందర్ రెడ్డి,అమర్ సింగ్, నవీన్‌రెడ్డి, కొడె పోచయ్య, కొల్తూరి మహేష్, ప్రసన్న లక్ష్మి, సుమలత, ఎంపల్లి అనంత రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పప్పుల అంజిరెడ్డి, చెరుకు పెంటయ్య, డీఈఈ శ్రీనివాస్, జానకి, జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ తదితరులు